# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 109 | సోమవారం 22, డిసెంబర్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com




# రెండేళ్లు ఆగాం... ఇక ఆగేది లేదు

## భూములు అమ్మడం తప్ప ఈ ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని విమర్శలు

- కాంగ్రెస్ పాలనపై కేసీఆర్ ఘాటు విమర్శలు
- సాగునీటి హక్కులపై మరో పోరాటానికి బీఆర్ఎస్
- పంచాయతీ ఫలితాలతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం
- వచ్చే ఎన్నికల్లో మనదే గెలుపు: కేసీఆర్
- ఇక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని హెచ్చరిక

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సుదీర్ఘ కాలం తర్వాత ప్రెస్ మీట్ పెట్టారు. కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరించారు. రెండేళ్లు ఆగామని, ఇక ఆగేది లేదని, ఇకపై ప్రభుత్వాన్ని అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని అన్నారు. రాష్ట్రంలో ఏం జరుగుతోంది... ఈ ప్రభుత్వం ఏం చేస్తోంది? అని ప్రశ్నించారు. భూములు అమ్మడం తప్ప ఈ ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై ఉపేక్షించేది లేదని, రాష్ట్రాన్ని ..మిగతా 2లో



# కేసీఆర్ మారుతారని ఆశించా

- అసెంబ్లీలో చర్చకు రావాలంటూ కేసీఆర్‌కు సీఎం రేవంత్ ఆహ్వానం
- నీటి వాటాల విషయంలో కేసీఆర్ తెలంగాణకు ద్రోహం చేశారని ఆరోపణ
- కృష్ణా, గోదావరి జలాల వాటాపై అసెంబ్లీలో చర్చిద్దామని ప్రతిపాదన



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ మారుతారని ఆశించా.. కానీ ..మిగతా 2లో



03

# హదీ ఆశయాలు కొనసాగిద్దాం

- తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ వివాదాస్పద వ్యాఖ్యలు
- భారత్ కు వ్యతిరేకంగా హాదీ ప్రసంగాలు
- హాదీ హత్యతో రగిలిపోయిన బంగ్లాదేశ్

## ఆరు గ్యారెంటీలు ఎప్పుడు
# అమలు చేస్తారు?

- అభయహస్తం లో ఇచ్చిన వాగ్దానాలు ఏమయ్యాయి?
- సోనియా జీ మీకు వాస్తవాలు తెలియదా?
- విజన్ డాక్యుమెంట్ ఒకే.. ఇచ్చిన హామీల మాటేంటి?
- సోనియా గాంధీకి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ





**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధికి కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీల అమలుపై తీవ్ర ప్రశ్నలు సంధించారు. లేఖలో కిషన్‌రెడ్డి ప్రస్తావిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ..మిగతా 3లో

## మేడారం మహాజాతర
# పోస్టర్ ఆవిష్కరణ




**సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా..**

- ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర
- జనవరి 28 నుంచి జాతర ప్రారంభం
- నాలుగు రోజుల పాటు నిర్వహణ
- కోట్ల సంఖ్యలో హాజరు కానున్న భక్తులు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, ఆధ్యాత్మిక గుర్తింపుగా నిలిచిన ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర ..మిగతా 2లో

## ఆర్ఎస్ఎస్‌కు రాజకీయాలు
# అంటగట్టొద్దు

- సంఘ్‌కు రాజకీయ అజెండా లేదు
- హిందూ సమాజాన్ని రక్షించడమే మా లక్ష్యం
- నైతిక విలువలున్న సంఘ
- సేవకులను తయారు చేస్తున్నాం
- పేదల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు కృషి
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్



02

# గాదె ఇన్నయ్య అరెస్ట్

- జనగామ జిల్లాలో అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ
- ఇన్నయ్య అనాథాశ్రమంలో ఆకస్మిక సోదాలు
- మొబైల్ ఫోన్లు సీజ్ చేసిన అధికారులు
- ఇటీవల మావోయిస్టులకు అనుకూలంగా నినాదాలు

03



# ధ్యానంతో భావోద్వేగాల నియంత్రణ

- ఏకాగ్రత కూడా ధ్యానంతోనే సాధ్యం
- మనసు ప్రశాంతంగా ఉంటే ఏకాగ్రత పెరుగుతుంది
- దేశంలో శాంతి, సామరస్యం ఎంతో అవసరం
- అప్పుడే వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యం
- భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
రంగారెడ్డి జిల్లా చేగూరులోని కన్హా శాంతివనంలో ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్, శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి శ్రీధర్‌బాబు తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడంలో ధ్యానం ఎంతో ఉపకరిస్తుందన్నారు. ధ్యానం చేసే ..మిగతా 2లో



02

# కర్ల రాజేశ్ కుటుంబానికి న్యాయం జరగకపోతే ధర్నాలు తప్పవు

- కర్ల రాజేశ్ లాకప్ డెత్‌పై మందకృష్ణ మాదిగ తీవ్ర ఆగ్రహం.
- నిందితుడైన ఎస్సైని ఎమ్మెల్యే, అధికారులు కాపాడుతున్నారని ఆరోపణ.
- ఎస్సైని సస్పెండ్ చేయకుండా ఎస్పీ ఆఫీస్‌కు అటాచ్ చేయడంపై విమర్శ
- రాజేశ్ మృతదేహానికి రీపోస్టుమార్టం చేయాలని డిమాండ్

# పల్లెలకు కొత్త పాలక వర్గాలు
## నేడు సర్పంచ్‌ల ప్రమాణ స్వీకారం

- రెండేళ్ల తర్వాత కొలువుదీరనున్న పాలక వర్గాలు
- ముస్తాబైన పంచాయతీ ఆఫీసులు
- ఉదయం 10.30 గంటలకు ముహూర్తం

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
గ్రామాల్లో నూతన పాలక వర్గాలు ప్రమాణ స్వీకారం చేయనున్నాయి. గత రెండేళ్లుగా అధికారుల పాలనలో ఉన్న పల్లెల్లో ఇవాళ కొత్త పాలక వర్గాలు ..మిగతా 3లో






# రైలు టికెట్ ధరల పెంపు

- డిసెంబర్ 26 నుంచి అమలు
- నెట్‌వర్క్ విస్తరణను బ్యాలెన్స్ చేసేందుకే పెంపు
- తక్కువ ఆదాయ వర్గాల ప్రయాణికులపై భారం తక్కువే
- రైల్వే శాఖకు ఒక ఆర్థిక సంవత్సరానికి రూ. 600 కోట్ల అదనపు ఆదాయం

**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**
భారతీయ రైల్వేశాఖ డిసెంబర్ 21, 2025న ప్యాసింజర్ టికెట్ ధరలను స్వల్పంగా పెంచుతూ కొత్త నిర్మాణాన్ని ప్రకటించింది. ఈ మార్పులు డిసెంబర్ 26 నుంచి ..మిగతా 2లో



# కర్ల రాజేశ్ కుటుంబానికి న్యాయం జరగకపోతే ధర్నాలు తప్పవు

- కర్ల రాజేశ్ లాకప్ డెత్‌పై మందకృష్ణ మాదిగ తీవ్ర ఆగ్రహం.
- నిందితుడైన ఎస్సైని ఎమ్మెల్యే, అధికారులు కాపాడుతున్నారని ఆరోపణ.
- ఎస్సైని సస్పెండ్ చేయకుండా ఎస్పీ ఆఫీస్‌కు అటాచ్ చేయడంపై విమర్శ
- రాజేశ్ మృతదేహానికి రీ-పోస్టుమార్టం చేయాలని డిమాండ్

**కోదాడ డిసెంబర్ 21(ప్రజాస్వరం):**

కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేశ్ లాకప్ డెత్ కేసులో కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్సైని స్థానిక ఎమ్మెల్యే రక్షిస్తున్నారని ఆయన విమర్శించారు. కోదాడ పబ్లిక్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాజేశ్ మృతికి కారణమైన ఎస్సై సురేశ్ రెడ్డిని సస్పెండ్ చేయకుండా ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేయడం వెనుక కుట్ర ఉందని మందకృష్ణ ఆరోపించారు. బలమైన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతోనే ఎస్సైపై చర్యలు తీసుకోవడం లేదని, ఇదే కేసులో బీసీ వర్గానికి చెందిన రూరల్ సీఐ ప్రతాప్ లింగంపై సస్పెన్షన్ వేటు వేయడం అన్యాయమని అన్నారు. మరియమ్మ లాకప్ డెత్ కేసు తరహాలోనే ఈ ఘటనలోనూ బాధ్యులైన వారందరినీ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే రాజేశ్ మృతదేహానికి రీపోస్టుమార్టం నిర్వహించాలని, ఎస్సై సురేశ్ రెడ్డిపై సెక్షన్ 302 కింద హత్య కేసు నమోదు చేయాలని మందకృష్ణ డిమాండ్ చేశారు. నిందితుడిపై కేసు పెట్టని డీఎస్పీలు, ఎస్పీలను కూడా విచారణ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లపై ధర్నాలకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

# కేసీఆర్ మారుతారని ఆశించా

**మొదటిపేజీ తరువాయి**

ఎలాంటి మార్పులు రాలేదు.. మళ్లీ అవే అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. రాజకీయ భిక్ష పెట్టిన ప్రాంతం గురించి పచ్చి అసత్యాలు చెప్పారని సీరియస్ అయ్యారు. తెలంగాణకు కేసీఆర్ చేసిన మేలు కంటే.. అన్యాయమే ఎక్కువ చేశారని అన్నారు. ఆరోపణలు చేయడం కాదు.. దమ్మొంటే చర్చకు రావాలి.. వచ్చే జనవరి 2వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు పెడతాం.. దమ్మొంటే కేసీఆర్ సమావేశాలకు రావాలని సవాల్ చేశారు. తెలంగాణకు ఎవరేం చేశారో సభలోనే చర్చిద్దామని అన్నారు. కలుగులోంచి ఎలుక బయటకు వచ్చినట్లు ఇవాళ కేసీఆర్ బయటకు వచ్చారని విమర్శించారు. పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు వాత పెట్టడంతో కనువిప్పు కలిగిందని అన్నారు. కేసీఆర్ ఆర్థిక ఉగ్రవాది అని కీలక వ్యాఖ్యలు చేశారు. రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. నాలుగు రకాలుగా అవకాశాలు ఉంటే.. అన్ని రకాల అప్పులు చేశారని అన్నారు.

నీటి వాటాల విషయంలో కేసీఆర్ హయాంలోనే రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. "811 టీఎంసీల నికర జలాల్లో మనకు 299 టీఎంసీలు చాలని సంతకం చేసి, మూడు జిల్లాలకు కేసీఆరే మరణశాసనం



రాశారు" అని తీవ్రంగా విమర్శించారు. ఏపీ జలదోపిడీకి కేసీఆర్ సహకరించారని, తాము 71 శాతం వాటా కోసం పోరాడుతున్నామని స్పష్టం చేశారు. జనవరి 2 నుంచి కృష్ణా, గోదావరి జలాల వాటాపై అసెంబ్లీలో చర్చిద్దామని ప్రతిపాదించారు. "మీ పాలన, మా పాలనపై చర్చిద్దామంటే కేసీఆర్ ముఖం చాటేస్తున్నారు. ఆయన అసెంబ్లీకి రావాలి, ఆయన గౌరవానికి ఎలాంటి భంగం వాటిల్లదు" అని హామీ ఇచ్చారు. ప్రాజెక్టుల విషయంలో ఎన్‌డీఎస్‌ఏ సూచనలు, నిపుణుల కమిటీ సలహాల మేరకే ముందుకెళ్తున్నామని సీఎం స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్ నేతలకు అనుమానాలుంటే, నిజనిర్ధారణ కమిటీని వేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

# రెండేళ్లు ఆగాం... ఇక ఆగేది లేదు

**మొదటిపేజీ తరువాయి**

రక్షించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

తెలంగాణ ప్రాజెక్టులు ఎందుకు ముందుకు వెళ్లడంలేదు, ఎవరి కుట్ర ఉంది... ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ విధానాలను ఎండగడతామని కేసీఆర్ హెచ్చరించారు. గోదావరి నీళ్ల దోపిడీపై ప్రభుత్వం స్పందించడంలేదని మండిపడ్డారు. పట్టిసీమ ద్వారా ఏపీ 80 టీఎంసీల గోదావరి నీటిని వాడుకుంటోందని అన్నారు. బచావత్ ట్రైబ్యునల్ ద్వారా ఎగువ రాష్ట్రాలకు ఆ 80 టీఎంసీలు ఇస్తామని ఏపీ చెప్పిందని తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్ర చెరో 20 టీఎంసీలు వాడుకుంటున్నాయని... బచావత్ ట్రైబ్యునల్ కేటాయింపులను పట్టించుకున్న వారే లేరని విచారం వ్యక్తం చేశారు. 40 టీఎంసీలు చాలని కేంద్రానికి ఎలా లేఖ రాస్తారని కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డారు.

నాడు కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు పాలమూరుకు ద్రోహం చేశాయని ఆరోపించారు. ఎంత దద్దమ్మ ప్రభుత్వం అయినా పాత ప్రాజెక్టులు కొనసాగించాలని స్పష్టం చేశారు. ఇక మౌనంగా ఉండేదిలేదని, బహిరంగ సభలు నిర్వహించి నీళ్ల కోసం నిలదీస్తామని స్పష్టం చేశారు. సమైక్య రాష్ట్రంలో జరిగిన మోసం నుంచి ఇప్పటికైనా బయటపడాలంటే, కొట్లాడి మన నీటి వాటా సాధించుకోవాలని అన్నారు.

ఉమ్మడి రాష్ట్రానికి చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు మహబూబ్ నగర్ జిల్లాను దత్తత తీసుకున్నాడని వెల్లడించారు. కానీ అభివృద్ధి పేరిట ఇష్టానుసారం పునాదిరాళ్లు వేశారే కానీ, అభివృద్ధి మాట మరిచారని విమర్శించారు. ఆ పునాది రాళ్లన్నీ కలిపితే ఒక ప్రాజెక్టు పూర్తవుతుందని వ్యాఖ్యానించారు. ఆ సమయంలో ఒక్క చుక్క నీరు కూడా పొలాల్లోకి పారలేదని, దాంతో పాలమూరు నుంచి ముంబైకి వలసలు పెరిగాయని వివరించారు. ఆనాడు తాను నిలదీయబట్టే చంద్రబాబు జూరాల ప్రాజెక్టు నిర్మించాడని కేసీఆర్ పేర్కొన్నారు. ఆ తర్వాత ఓ టీడీపీ ఎమ్మెల్యే బాంబులతో ఆర్డీఎస్ కాలువను పేల్చేశాడని తెలిపారు. ఆనాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటే తెలంగాణకు పెద్ద శాపంలా మారిందని, మహబూబ్ నగర్ జిల్లాకు తీవ్ర నష్టం జరిగిందని కేసీఆర్ వెల్లడించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మొదటి నుంచి తెలంగాణకు శనిలా దాపురించిందని అన్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం.. సర్వభ్రష్ట ప్రభుత్వం**

"పాలమూరు జిల్లాలో చెరువుల లెక్కలు తీసి కేంద్రానికి సమర్పించాం. చంద్రబాబు మాటలు విని కేంద్రంలోని భాజపా ప్రభుత్వం మమ్మల్ని ఇబ్బంది పెట్టింది. భాజపా ప్రభుత్వం మొదటి




నుంచి మాకు శనిలా దాపురించింది. ఎంత దద్దమ్మ ప్రభుత్వం అయినా పాత ప్రాజెక్టులను కొనసాగించాలి కదా. రెండేళ్లయినా పాలమూరు ప్రాజెక్టులో తట్టెడు మట్టయినా తీయలేదు. ఎంత సేపూ భూములు అమ్ముకుందామనే యావలోనే ఉంటే ఎలా? రాష్ట్రానికి వచ్చే నీళ్లను కూడా కాపాడలేని ఇదేమి దద్దమ్మ ప్రభుత్వం. కేవలం 40 టీఎంసీలు చాలని కేంద్రానికి ఎలా లేఖ రాస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ప్రజల మధ్య ఎండగడతాం. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో గ్రామ గ్రామాన ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతాం. భారీ బహిరంగ సభలు నిర్వహిస్తాం.. సభలకు నేనూ వస్తా. ఈ ప్రభుత్వానికి కావాల్సినంత సమయం ఇచ్చాం. ఇకపై మౌనంగా ఉండేది లేదు.. పాలమూరుపై కేంద్రాన్ని ఎండగడతాం.. పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం నోరుమూసుకుని ఉంటే.. మేమైనా పూనుకోవాలి కదా. కళ్లముందే ఇంత మోసం జరుగుతుంటే కేసీఆర్ మౌనంగా ఉంటారా? అందుకే నేనే స్వయంగా రంగంలోకి దిగాలని నిర్ణయం తీసుకున్నా. ఇవాల్టి వరకూ ఒక కథ..రేపటి నుంచి మరో కథ. తెలంగాణ కోసం ఎందాకైనా పోరాడతాం.. ఎలాంటి మొహమాటాలు ఉండవు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.. సర్వభ్రష్ట ప్రభుత్వం" అని కేసీఆర్ విమర్శించారు.

# ఆర్ఎస్ఎస్‌కు రాజకీయాలు అంటగట్టొద్దు

- సంఘ్‌కు రాజకీయ అజెండా లేదు
- హిందూ సమాజాన్ని రక్షించడమే మా లక్ష్యం
- నైతిక విలువలున్న సంఘ సేవకులను తయారు చేస్తున్నాం
- పేదల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు కృషి
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల (సెంటెనరీ సెలబ్రేషన్స్)లో భాగంగా పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని సైన్స్ సిటీ ఆడిటోరియంలో డిసెంబర్ 21, 2025న నిర్వహించిన కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్ఎస్ఎస్‌ను భారతీయ జనతా పార్టీ (బీజేపీ) దృక్కోణంలో చూసి అర్థం చేసుకోవడం అతి పెద్ద తప్పిదమని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి పోలికలు, రాజకీయ కోణంలో చూడటం వల్ల ప్రజల్లో తరచూ అపార్థాలు, తప్పుడు భావనలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఆర్ఎస్ఎస్ శతాబ్ది వార్షికోత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా నాలుగు ప్రధాన నగరాలు - కోల్‌కతా, ఢిల్లీ, ముంబై, బెంగళూరు -లో నిర్వహిస్తున్న లెక్చర్ సిరీస్‌లో ఒకటి. ఈ సిరీస్ ద్వారా సంఘ్ గురించి నిజాలను ప్రజల ముందుకు తీసుకొచ్చి, తప్పుడు ప్రచారాలను ఖండించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు భాగవత్ తెలిపారు.

**సంఘ్‌కు రాజకీయ అజెండా లేదు**

మోహన్ భాగవత్ మాట్లాడుతూ, "సంఘ్‌కు ఎలాంటి రాజకీయ అజెండా లేదు. హిందూ సమాజాన్ని రక్షించడం, దాని ఉన్నతికి కృషి చేయడం మా లక్ష్యం. నైతిక విలువలు,



సామాజిక బాధ్యతలు కలిగిన స్వయంసేవకులను తయారు చేసి, ఆరోగ్యకరమైన సమాజాన్ని, బలమైన దేశాన్ని నిర్మించడమే మా నిరంతర కృషి" అని వివరించారు. సంఘ్‌కు శత్రువులు లేరని, కానీ సంకుచిత స్వార్థాలు కలిగిన కొందరు సంఘ్ వృద్ధి చెందితే తమ 'దుకాణాలు' మూతపడతాయని భయపడుతున్నారని ఆయన ఎత్తి చూపారు. దీంతో తప్పుడు ప్రచారాలు, అబద్ధాలు వ్యాప్తి చేస్తున్నారని విమర్శించారు.

**వాస్తవాల ఆధారంగా అభిప్రాయం ఏర్పరచుకోవాలి**

దేశంలో ప్రతి వ్యక్తికీ సంఘ్ గురించి తమ అభిప్రాయం చెప్పే హక్కు ఉందని, అయితే అది వాస్తవికతపై ఆధారపడి ఉండాలని భాగవత్ నొక్కి చెప్పారు. "కల్పనలు లేదా ఇతరుల మాటల ఆధారంగా కాకుండా, నిజాలతోనే అభిప్రాయాలు ఏర్పరచుకోవాలి. సంఘ్ పనిని సమీపంగా చూసి అర్థం చేసుకోవాలి" అని సూచించారు.

**దేశమే ప్రాధాన్యం – విశ్వగురువుగా భారత్**

సంఘ్ స్వయంసేవకులు దేశాన్ని ముందు పెట్టుకుని, పేదల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు కృషి చేస్తున్నారని భాగవత్ పేర్కొన్నారు. ఈ కృషి ద్వారా భారత్ మళ్లీ విశ్వగురువుగా అవతరిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సంఘ్ పని దేశవ్యాప్తంగా విస్తరిస్తుందని, అందరూ దాన్ని సానుకూలంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, బుద్ధిజీవులు, స్వయంసేవకులు పాల్గొన్నారు. శతాబ్ది ఉత్సవాలు దేశవ్యాప్తంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించాయి.

# ధ్యానంతో భావోద్వేగాల నియంత్రణ

**మొదటిపేజీ తరువాయి**

వ్యక్తి మనసు ఏకాగ్రతతో ఉంటుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో ఒత్తిడి, ఆందోళన పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ధ్యానాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు.

డిసెంబరు 21ను ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని గుర్తుచేశారు. యోగా, ధ్యాన రంగాల్లో భారత్ ఎప్పుడూ ముందంజలో ఉంటుందని చెప్పారు. భారతదేశం ఆధ్యాత్మికతకు కేంద్రబిందువుగా నిలుస్తోందని పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంలో ఆర్థికాభివృద్ధితో పాటు దేశంలో శాంతి, సామరస్య వాతావరణం కూడా భాగమేనని ఉపరాష్ట్రపతి వ్యాఖ్యానించారు.

శాంతి, సామరస్యం, ఆధ్యాత్మిక విలువలను సమాజంలో విస్తృతంగా ప్రోత్సహిస్తున్నందుకు హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థను ఉపరాష్ట్రపతి అభినందించారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేసేలా శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేష్ డి. పటేల్ (దాజీ) చొరవ తీసుకుంటున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేష్ డి. పటేల్ (దాజీ) మాట్లాడుతూ.. ధ్యానం ద్వారా ఒత్తిడి, ఆందోళనను జయించవచ్చని తెలిపారు. మనసును కేంద్రంగా చేసుకుని ధ్యానం చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని అన్నారు. మనసు ప్రశాంతంగా ఉంటే ఏకాగ్రత పెరుగుతుందని, దాని ద్వారా సునాయాసంగా విజయాలు సాధించవచ్చని వివరించారు. ధ్యానం చేసిన తరువాత మనలో వచ్చే మార్పును మనమే గమనించగలమని చెప్పారు. ప్రపంచ ధ్యాన దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ఉపరాష్ట్రపతి, గవర్నర్‌లు ఒకే వేదికపై ధ్యానం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో సాధకులు, ప్రముఖులు హాజరై ధ్యాన సాధనలో పాల్గొన్నారు.



# మేడారం మహాజాతర పోస్టర్ ఆవిష్కరణ

**మొదటిపేజీ తరువాయి**

అయిన మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర2026కు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిసెంబర్ 20న ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఆయన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దనసరి అనసూయ (సీతక్క), కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సీఎం రేవంత్ రెడ్డికి సమ్మక్క తల్లి కంకణం కట్టి, బొట్టు పెట్టారు. ఈ కార్యక్రమం జాతర ఏర్పాట్లకు అధికారిక శ్రీకారం చుట్టినట్లు భావిస్తున్నారు.

**మేడారం జాతర-2026 తేదీలు**

కోయ పూజారులు ఖరారు చేసినట్లు, 2026 మేడారం మహాజాతర జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు జరుగనుంది.

*జనవరి 28 (బుధవారం)*: సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలకు చేరిక.

*జనవరి 29 (గురువారం)*: సమ్మక్క గద్దెకు చేరిక. జనవరి 30 (శుక్రవారం)*: భక్తులు మొక్కులు చెల్లించుకోవడం.

*జనవరి 31 (శనివారం)*: వనప్రవేశం (అమ్మవార్లు అడవికి తిరిగి ప్రవేశం).

ఈ జాతరను తెలంగాణ కుంభమేళాగా పిలుస్తారు. రెండేళ్లకోసారి జరిగే ఈ మహోత్సవంలో కోట్లాది మంది భక్తులు పాల్గొంటారు.

**ఏర్పాట్లు జోరుగా**

ప్రభుత్వం ఇప్పటికే జాతర ఏర్పాట్లను వేగవంతం చేసింది. సమ్మక్కసారలమ్మ గద్దెల విస్తరణ, ఆలయ అభివృద్ధి కోసం కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించింది. రూ.150 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసింది. రోడ్లు, భక్తుల వసతి, జంపన్న వాగు అభివృద్ధి, భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించింది. సీఎం రేవంత్ రెడ్డి గతంలో మేడారం పర్యటనలో గద్దెల డిజైన్లను ఆవిష్కరించి, అభివృద్ధి పనులను 100 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జాతరకు జాతీయ హోదా ఇవ్వాలని, కేంద్రం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మేడారం జాతర గిరిజన సంస్కృతి, సమ్మక్కసారలమ్మల త్యాగానికి చిహ్నం. ఈసారి మరింత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. భక్తులు ముందుగానే ప్రణాళికలు రూపొందించుకోవచ్చు.



# రైలు టికెట్ ధరల పెంపు

**మొదటిపేజీ తరువాయి**

అమల్లోకి రానున్నాయి. పెరుగుతున్న ఆపరేషనల్ ఖర్చులు, మానవ వనరుల వ్యయం, పెన్షన్లు మరియు నెట్‌వర్క్ విస్తరణను బ్యాలెన్స్ చేయడానికి ఈ చర్య తీసుకున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ పెంపుతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.600 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు.

**ఎవరిపై ప్రభావం పడదు?**

రైల్వేశాఖ ఈ పెంపును "స్వల్ప రేషనలైజేషన్"గా వర్ణిస్తూ, సాధారణ మరియు తక్కువ ఆదాయ వర్గాల ప్రయాణికులపై భారం పడకుండా జాగ్రత్తలు తీసుకుంది. సబర్బన్ (లోకల్) రైళ్లు మరియు మంత్లీ సీజన్ టికెట్లు (MST ఎలాంటి పెంపు లేదు. రోజువారీ ప్రయాణికులకు ఉపశమనం. ఆర్డినరీ క్లాస్ (సాధారణ శ్రేణి) 215 కిలోమీటర్ల లోపు ప్రయాణాలకు ధరల్లో మార్పు లేదు.

**ధరల పెంపు వివరాలు**

ఆర్డినరీ క్లాస్ (215 కి.మీ. పైబడిన ప్రయాణాలు) కిలోమీటర్‌కు 1 పైసా పెంపు.

మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లు నాన్‌ఏసీ కోచ్‌లు*: కిలోమీటర్‌కు 2 పైసలు పెంపు.

ఏసీ క్లాస్‌లు (అన్ని రైళ్లు)*: కిలోమీటర్‌కు 2 పైసలు పెంపు.

**ఉదాహరణలు: ఎంత అదనంగా చెల్లించాలి?**

500 కిలోమీటర్ల నాన్‌ఏసీ ప్రయాణం (మెయిల్/ఎక్స్‌ప్రెస్): అదనంగా కేవలం రూ.10 మాత్రమే.

ప్రీమియం రైళ్లు (రాజధాని, వందే భారత్, శతాబ్ది వంటివి): సుమారు రూ.20 అదనం (దూరం ఆధారంగా).

ఈ పెంపు మెయిల్, ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ మరియు ప్రీమియం రైళ్లకు వర్తిస్తుంది. గమనిక: జూలై 2025లో జరిగిన మునుపటి పెంపు నుంచి రూ.700 కోట్ల ఆదాయం వచ్చిన నేపథ్యంలో ఈ కొత్త మార్పు వచ్చింది.

**నేపథ్యం: ఎందుకు ఈ పెంపు?**


గత దశాబ్దంలో రైల్వే నెట్‌వర్క్ గణనీయంగా విస్తరించింది. దేశంలోని అత్యంత మారుమూల ప్రాంతాలకు చేరుకుంటూ, భద్రత మరియు సేవల మెరుగుదలకు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టింది.

మానవ వనరుల ఖర్చు: రూ.1.15 లక్షల కోట్లు.

పెన్షన్లు: సంవత్సరానికి రూ.60,000 కోట్లు.

మొత్తం ఆపరేషనల్ ఖర్చు (202425): రూ.2.63 లక్షల కోట్లు.

ఫ్రైట్ ట్రాఫిక్ పెంచడంతో పాటు ప్యాసింజర్ ధరల్లో స్వల్ప సర్దుబాటు చేయడం ద్వారా



ఈ ఖర్చులను బ్యాలెన్స్ చేస్తున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. భారత్ ప్రపంచంలో రెండవ అతిపెద్ద కార్గో క్యారియర్ రైల్వేగా మారిన సంగతి కూడా ప్రస్తావించింది.

**ప్రయాణికులకు సలహా**

డిసెంబర్ 26 తర్వాత ప్రయాణాలకు టికెట్లు బుక్ చేసేవారు IRCTC వెబ్‌సైట్ లేదా యాప్‌లో కొత్త ధరలు చెక్ చేసుకోవాలి. ఇప్పటికే బుక్ చేసిన టికెట్లపై ఎలాంటి మార్పు ఉండదు. ఈ స్వల్ప పెంపుతో రైల్వే సేవలు మరింత మెరుగవుతాయని, సామాన్య ప్రయాణికులకు భారం పడకుండా చూసినట్లు అధికారులు హామీ ఇచ్చారు. ఇది రైల్వే ఆర్థిక బలోపేతానికి దోహదపడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ఆరు గ్యారెంటీలు ఎప్పుడు
# అమలు చేస్తారు?

**మొదటిపేజీ తరువాయి**



ప్రతిష్టాత్మకంగా రూపొందించిన *'తెలంగాణ రైజింగ్-2047 విజన్' పేరుతో రూపొందించిన డాక్యుమెంట్ పుస్తకాన్ని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన సందర్భంగా స్వయంగా సోనియా గాంధికి అందించారని గుర్తుచేశారు. ఆ సందర్భంగా ముఖ్యమంత్రి పనితీరు, రాష్ట్ర అభివృద్ధిపై ఆయన దూరదృష్టిని అభినందిస్తూ, విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు. అయితే, 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సమయంలో హైదరాబాద్ శివారులోని తుక్కుగూడలో నిర్వహించిన కాంగ్రెస్ బహిరంగ సభలో సోనియా గాంధి స్వయంగా *'అభయహస్తం'* పేరిట పార్టీ మేనిఫెస్టోను ఆవిష్కరించారని గుర్తు చేశారు. అదే సభలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని స్పష్టంగా ప్రకటించిన విషయాన్ని లేఖలో ప్రస్తావించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినప్పటికీ, ఈ కాలంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై సోనియా గాంధి గానీ, ఆమె కుటుంబ సభ్యులైన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ గానీ, పార్టీ నాయకత్వం గానీ ఏనాడైనా సమీక్ష చేశారా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. కనీసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిమ్మల్ని కలిసిన సందర్భాల్లోనైనా ఆరు గ్యారంటీల అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారా? అని నిలదీశారు.

రెండేళ్ల పాలన పట్ల ముఖ్యమంత్రిని అభినందించారంటే.. *తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలయ్యాయా? లేదా? అనే వాస్తవాలు మీకు తెలియకుండానే అభినందనలు తెలిపారా?* అంటూ విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పక్కనపెట్టి, ప్రజలను వంచిస్తూ, అభివృద్ధి పేరిట విజన్ డాక్యుమెంట్‌ను ముందుకు తెచ్చి కాంగ్రెస్ పార్టీ నాయకులు పరస్పరం అభినందించుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని విమర్శించిన కిషన్‌రెడ్డి, ఇప్పుడు విజన్ డాక్యుమెంట్ పేరిట కొత్త హామీలతో మరోసారి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. *ఎన్నికలప్పుడు ఇచ్చిన ఆరు గ్యారంటీలను గాలికొదిలేశారా? మేనిఫెస్టోలో ఇచ్చిన 420 హామీలను మూసీ నదిలో కలిపేశారా? లేక గాంధీభవన్‌లో పాతరేశారా?* అనే ప్రశ్నలకు తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిన నేపథ్యంలో, కొత్త ఆశలు, కొత్త హామీలు చెప్పే ముందు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. లేదంటే ఎన్నికల సమయంలో ప్రయోగించిన *అభయహస్తమే ప్రజల ఆగ్రహంగా మారి భస్మాసుర హస్తంగా మారుతుందని* హెచ్చరించారు. ముఖ్యంగా గ్యారంటీల పేరుతో రైతులు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలకు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టంగా చెప్పాలని కోరారు. ఇచ్చిన హామీల అమలులో మోసం చేస్తే భవిష్యత్తులో తెలంగాణ ప్రజలు కూడా తగిన గుణపాఠం చెబుతారని లేఖలో కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

# ధ్యానంతోనే ప్రశాంతత

**గోదావరిఖని డిసెంబర్ 21(ప్రజాస్వరం)**

ధ్యానం తోనే ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చని యోగా గురువు పులకంటి సుజాత అన్నారు. శివ సాయి మల్టీ ప్రొడ్యూసర్ ఎండి ఆదేశాల మేరకు గోదావరిఖని మార్కండేయ కాలనీలోని ఖని శాఖ శివసాయి మల్టీ ప్రొడ్యూసర్ సంస్థ డైరెక్టర్ నాగుల కమల అధ్యక్షతన ధ్యానంపై అవగాహన కలిగించారు. మహిళలకు ధ్యాన శిక్షణ తరగతులతో ఎంతో ప్రయోజనం జరుగుతుందని, నిత్య ధ్యాన సాధన తో మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను నివారించవచ్చు అన్నారు. ఇందులో షేర్ హోల్డర్ నాగుల శ్రీధర్, సీనియర్స్ దొంత కనక లక్ష్మి, నాగుల సాయి ప్రియ, గుండేటి సరిత, పెనుగొండ స్వాతి, అనిశెట్టి స్వప్న, ఆఫీస్ స్టాఫ్ బోయిన శ్రీలత కొంకటి సంధ్య, నిర్మల తదితరులు పాల్గొన్నారు.




# హాదీ ఆశయాలు కొనసాగిద్దాం

- **తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు**
- **మహమ్మద్ యూనస్ వివాదాస్పద వ్యాఖ్యలు**
- **భారత్ కు వ్యతిరేకంగా హాదీ ప్రసంగాలు**
- **హాదీ హత్యతో రగిలిపోయిన బంగ్లాదేశ్**

**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**



బంగ్లాదేశ్‌లో గతేడాది షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూల్చిన విద్యార్థుల ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన యువ నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హాదీ మరణంతో దేశవ్యాప్తంగా ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ నెల 12న ఢాకాలో ముసుగు ధరించిన దుండగులు హాదీపై కాల్పులు జరిపారు. తీవ్ర గాయాలతో సింగపూర్‌లో చికిత్స పొందుతూ డిసెంబర్ 18న అతడు మృతి చెందాడు. హాదీ మరణ వార్త వెలువడిన వెంటనే ఢాకా సహా అనేక నగరాల్లో ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. మీడియా కార్యాలయాలపై దాడులు, ఆస్తుల ధ్వంసం, భారత వ్యతిరేక నినాదాలు వినిపించాయి. హాదీ ఇంకిలాబ్ మంచ్ అనే సంస్థ స్పోక్‌స్పర్సన్. ఈ సంస్థ భారత్‌కు వ్యతిరేకంగా పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ, "గ్రేటర్ బంగ్లాదేశ్" మ్యాప్‌లు విడుదల చేసినందుకు ప్రసిద్ధి. హాదీని భారత వ్యతిరేక నాయకుడిగా అనేక మాధ్యమాలు వర్ణిస్తున్నాయి. ఫిబ్రవరి 2026లో జరగనున్న ఎన్నికల్లో అతడు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించాడు.

**అంత్యక్రియల్లో యూనస్ ప్రసంగం**

డిసెంబర్ 20న ఢాకాలోని జాతీయ పార్లమెంట్ భవనం (సంసద్ భవన్) సౌత్ ప్లాజాలో హాదీ అంత్యక్రియలు కట్టుదిట్టమైన భద్రత మధ్య జరిగాయి. లక్షలాది మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ కూడా పాల్గొన్నారు. జనాజా నమాజ్‌కు ముందు యూనస్ భావోద్వేగ ప్రసంగం చేశారు.

"ప్రియమైన ఉస్మాన్ హాదీ.. మేము నీకు వీడ్కోలు చెప్పేందుకు ఇక్కడికి రాలేదు. బంగ్లాదేశ్ ఉన్నంత కాలం నువ్వు ఈ దేశ ప్రజల హృదయాల్లో ఉంటావు. ఎవరూ నిన్ను అక్కడి నుంచి తొలగించలేరు." "నువ్వు మాకు చెప్పిన మాటలను నెరవేరుస్తామని ప్రమాణం చేస్తున్నాం. నీవు చెప్పిన మంత్రం ఈ దేశం మరచిపోలేదు, ఎప్పటికీ మా చెవుల్లో ప్రతిధ్వనిస్తుంది." హాదీ మానవత్వం, ప్రజలతో కలిసిపోయే తీరు, రాజకీయ ఆదర్శాలను యూనస్ ప్రశంసించారు. "బంగ్లాదేశ్ తలెత్తుకుని నిలబడుతుంది, ఎవరి ముందు తలవంచదు" అనే హాదీ స్లోగన్‌ను ప్రస్తావిస్తూ, దానిని తరతరాలుగా కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. హాదీ ఎన్నికల్లో పాల్గొనాలనే కోరికను కూడా యూనస్ ప్రస్తావించారు.ఈ వ్యాఖ్యలు భారత్‌లో ఆందోళన కలిగిస్తున్నాయి. హాదీ భారత వ్యతిరేక వైఖరికి ప్రసిద్ధుడు కావడంతో, యూనస్ ఆయన ఆదర్శాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పడం ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**హాదీ మరణం నేపథ్యం**

2024లో షేక్ హసీనా ప్రభుత్వాన్ని పడగొట్టిన విద్యార్థుల ఆందోళనలో హాదీ ముందుండి నడిపాడు. డిసెంబర్ 12న ఢాకాలోని బిజయ్‌నగర్ ప్రాంతంలో ఎన్నికల ప్రచారంలో ఉండగా ముసుగు ధరించిన వ్యక్తులు అతడిపై కాల్పులు జరిపారు.

తీవ్ర గాయాలతో ముందు ఢాకాలో, తర్వాత సింగపూర్‌లో చికిత్స పొందాడు. చివరికి మరణించాడు.

మరణ వార్తతో ఢాకాలో శాహబాగ్ చౌరస్తా బ్లాక్ చేయడం, మీడియా ఆఫీసులపై దాడులు, భారత దౌత్య కార్యాలయాల వైపు మార్చ్‌లు జరిగాయి.

**దేశవ్యాప్త దిగ్భ్రాంతి, రాష్ట్ర దుఃఖదినం**

యూనస్ ప్రభుత్వం డిసెంబర్ 20న రాష్ట్ర దుఃఖదినంగా ప్రకటించింది. జాతీయ జెండా అర్ధ నీరాజనం, ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. హాదీని ఢాకా యూనివర్సిటీ సెంట్రల్ మసీదు ప్రాంగణంలో జాతీయ కవి కాజీ నజ్రుల్ ఇస్లాం సమాధి పక్కన ఖననం చేశారు. హాదీ మరణంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇంకిలాబ్ మంచ్ నేతలు హంతకులను త్వరగా అరెస్ట్ చేయాలని 24 గంటల గడువు ఇచ్చారు. ఈ ఘటన బంగ్లాదేశ్‌లో రాజకీయ అస్థిరతను మరింత పెంచింది. ఫిబ్రవరి ఎన్నికల నేపథ్యంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

# గాదె ఇన్నయ్య అరెస్ట్

- **జనగామ జిల్లాలో అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ**
- **ఇన్నయ్య అనాథాశ్రమంలో ఆకస్మిక సోదాలు**
- **మొబైల్ ఫోన్లు సీజ్ చేసిన అధికారులు**
- **ఇటీవల మావోయిస్టులకు అనుకూలంగా నినాదాలు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**



తెలంగాణలోని ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు, మాజీ మావోయిస్టు నేత గాదె ఇన్నయ్య (గాదె ఇన్నారెడ్డి)ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు డిసెంబర్ 21, 2025న అరెస్టు చేశారు. జనగామ జిల్లా జాఫర్‌గఢ్ మండల కేంద్రంలో ఆయన నిర్వహిస్తున్న అనాథాశ్రమం (మా ఇల్లు ఆశ్రమం)కు నాలుగు వాహనాల్లో వచ్చిన ఎన్ఐఏ బృందం ఆయన్ను అదుపులోకి తీసుకుంది. ఈ సందర్భంగా ఆశ్రమంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఆయన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు.

**అరెస్టుకు కారణం**

ఇటీవల మరణించిన మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు కాతా రామచంద్రా రెడ్డి (అలియాస్ వికల్ప్, రాజుదాదా) అంత్యక్రియలకు గాదె ఇన్నయ్య హాజరై, అక్కడ చేసిన ప్రసంగం కారణంగా ఈ అరెస్టు జరిగింది. ఆ సభను సీపీఐ (మావోయిస్టు) అనుబంధ సంస్థ అయిన అమరుల బంధు మిత్రుల సంఘం (ఏబీఎంఎస్) ఏర్పాటు చేసింది. ఇన్నయ్య ప్రసంగంలో మావోయిస్టులకు అనుకూలంగా మాట్లాడి, సాయుధ తిరుగుబాటు కార్యకలాపాలను ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ప్రసంగానికి సంబంధించిన వీడియో ఆధారాలు ఎన్ఐఏ వద్ద ఉన్నట్లు అధికారులు తెలిపారు. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు ప్రేరేపణ, నిషేధిత సంస్థలతో సంబంధాలు వంటి ఆరోపణల కింద యూఏపీఏ (అన్‌లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్) సెక్షన్లతో కేసు నమోదైంది.

**గాదె ఇన్నయ్య నేపథ్యం**

గాదె ఇన్నయ్య తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న వ్యక్తి. మాజీ మావోయిస్టు నాయకుడిగా పేరుగాంచారు. అనాథాశ్రమం నిర్వహణతో పాటు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. గతంలోనూ మావోయిస్టు సంబంధిత కేసుల్లో ఆయన పేరు ప్రస్తావనకు వచ్చింది, కానీ ఈ అరెస్టు తాజా సంఘటనల ఆధారంగా జరిగింది.

ఎన్ఐఏ అధికారులు ఆయన్ను హైదరాబాద్‌లోని నాంపల్లి ఎన్ఐఏ స్పెషల్ కోర్టులో హాజరుపరచే అవకాశం ఉంది. దర్యాప్తు కొనసాగుతోంది, మరిన్ని వివరాలు త్వరలో వెలుగులోకి రావచ్చు. ఈ ఘటన తెలంగాణ రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# పల్లెలకు కొత్త పాలక వర్గాలు

**మొదటిపేజీ తరువాయి**

కొలువుదీరనున్నాయి. సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు తమ పదవీ బాధ్యతలను స్వీకరించేందుకు ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. ఉదయం 10.30 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రమాణ స్వీకారోత్సవాలు జరగనున్నాయి. పంచాయతీరాజ్ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏకగ్రీవ పంచాయతీలు కలిపి 12,702, ఉప సర్పంచులు, 85,955 వార్డుల్లో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనున్నది.

**ఇన్నాళ్లూ ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో..**

రెండేళ్లుగా పల్లెల్లో ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో పాలన సాగింది. ఎన్నికల ప్రక్రియ ముగిసి, ఫలితాలు వెలువడడంతో గ్రామాలు మళ్లీ ప్రజాప్రతినిధుల పాలనలోకి వెళ్తున్నాయి. సుదీర్ఘ విరామం తర్వాత పాలక వర్గాలు బాధ్యతలు చేపడుతుండడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొన్నది. నేడు పంచాయతీ పాలక వర్గాల ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా కార్యాలయాలు కొత్త కళను సంతరించుకున్నాయి. నూతన పాలక వర్గానికి స్వాగతం పలికేందుకు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. షామియానాలు, పూల అలంకరణలతో జీపీలు పెళ్లి పందిళ్లను తలపిస్తున్నాయి. గ్రామస్తులు, గెలిచిన అభ్యర్థుల కుటుంబ సభ్యులు, అనుచరులతో సందడి నెలకొన్నది. ప్రమాణ స్వీకారం ముగిసిన వెంటనే నూతన సర్పంచ్ అధ్యక్షతన గ్రామ పంచాయతీల తొలి సమావేశం జరగనున్నది. ఈ సమావేశానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. గ్రామంలో నెలకొన్న తాగునీరు, పారిశుద్ధ్యం వంటి తక్షణ సమస్యలపై ఈ సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నది. ఓటేసి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ పాలక వర్గాలు తీర్మానం చేయనున్నాయి.



## కరిడివారిపల్లి లో మాజీ సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద
# వైయస్ జగన్మోహన్ రెడ్డి 53 వ జన్మదిన వేడుకలు

- **ముఖ్య అతిథులుగా పాల్గొన్న పూతలపట్టు మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్**
- **మీడియాతో మాట్లాడిన మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ఎం బి కుమార్ రాజా**
- **విద్యుత్ చార్జీల బాదుడు పై ఖండించిన మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి**
- **పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉన్న వ్యక్తి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి తెలిపారు**

**బంగారుపాల్యం డిసెంబర్ 21(ప్రజాస్వరం):**

చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం కరిడివారి పల్లి పంచాయతీలోగల క్రీస్తు శేషులు ఏపి మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి 53వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 11:30 గంటలకు మండల నాయకులు స్థానిక గ్రామ సర్పంచి ఆశారాజేష్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి అక్కడికి విచ్చేసిన వైఎస్ఆర్సిపి కార్యకర్తలకు నాయకులకు కేక్ పంచిపెట్టారు. అనంతరం కరిడివారిపల్లె గ్రామంలో స్థానిక సర్పంచ్ ఆశా రాజేష్, పంచాయతీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో, అక్కడికి విచ్చేసినటువంటి వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులకు కార్యకర్తలకు గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమాన్ని పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ ఎం బి కుమార్ రాజా, మాజీ ఎమ్మెల్యే లలిథా థామస్ మాట్లాడుతూ ప్రజల గుండెల్లో నిలచిపోయిన వైయస్ జగన్మోహన్ రెడ్డి తిరిగి 2029వ సంవత్సరంలో ముఖ్యమంత్రిగా చూడాలన్నది మనందరి కోరిక అని వారు తెలిపారు.17 మెడికల్ కాలేజీల విషయంలో కోటి సంతకాలకు పైగా సేకరించిన వైఎస్ఆర్సిపి పార్టీ గవర్నర్ కు పంపడం జరిగిందని వారు తెలియజేశారు. కార్యక్రమంలో మండల వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక సర్పంచి ఆశా రాజేష్, గ్రామ కమిటీ సభ్యులు, మహిళలు, యువత, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.









## సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి

**మాసాయిపేట్ డిసెంబర్ 22( ప్రజాస్వరం)**

సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షురాలిగా సౌందర్య రఘుపతి, ప్రధాన కార్యదర్శిగా మాధవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల సర్పంచులు సమావేశమై ఈ కమిటీని ఎన్నుకున్నారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. సర్పంచ్ల ఐక్యతతో మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫర్ అధ్యక్షునిగా వీరన్న గారి కృష్ణారెడ్డి ప్రధాన కార్యదర్శిగా మాధవరెడ్డి ఉపాధ్యక్షుడు రమేష్. సౌందర్య రఘు కార్యదర్శిలు రాములు కోశాధికారి దీప్తి కార్యవర్గం సభ్యులు ప్రశాంత్ రేణుక. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ నాగిరెడ్డి సొసైటీ డైరెక్టర్ ఉదండపురం నరసింహులు తదితరులు పాల్గొన్నారు



## బొంతపల్లిలో భూత్ అధ్యక్షుల సమ్మేళనం శక్తి కేంద్రాల ఇన్చార్జిలతో

**గుమ్మడిదల డిసెంబర్ 21 (ప్రజాస్వరం)**

గుమ్మడిదల మున్సిపాలిటీ బొంతపల్లి వార్డ్ పరిధి వీరన్న గూడెంలో భారతీయ జనతా పార్టీ భూత్ అధ్యక్షుల సమ్మేళనంతో శక్తి కేంద్రాల ఇన్చార్జిల సమావేశం ఆదివారం నాడు మధ్యాహ్నం భూత్ అధ్యక్షులు వీరన్న గూడెం సీనియర్ నాయకులు రామచందర్ గారి స్వగృహంలో ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుమ్మడిదల మండల భారతీయ జనతా పార్టీ ప్రెసిడెంట్ కావలి ఐలేష్ హాజరై ఈ యొక్క కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఐలేష్ మాట్లాడుతూ రాబోవు స్థానిక ఎంపిటిసి,జడ్పిటిసి మరియు స్థానిక మున్సిపల్ ఎలక్షన్లో గెలిపే దిశగా ప్రతి ఒక్కరూ నామినేషన్ లో నిలబడే విధంగా దిశ నిర్దేశం చేస్తూ ఈ యొక్క శక్తి కేంద్రాల ఇన్చార్జుల భూత్ అధ్యక్షుల సమ్మేళనం సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.కార్యక్రమంలో, భూత్ అధ్యక్షులు యాదగిరి, ముత్యాల గౌడ్, బాగయ్య, గంగా గౌడ్, లింగముగౌడ్, శేఖర్ నాయక్ తదిరులు పాల్గొన్నారు.



## భార్య భర్తల కేసులను రాజీ చేసుకోవాలి

**మేడ్చల్,(ప్రజాస్వరం):**

భార్య భర్తల తగాదాలు, సివిల్ కేసులు, కుటుంబ సమస్యలు, ఎన్ ఆక్ట్ కేసులు బయటనే పరిష్కరించుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ సిహెచ్ పంచాక్షరి సూచించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మేడ్చల్ కోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పంచాక్షరి మాట్లాడారు. జిల్లా భానుమతి మాట్లాడుతూ లోక అదాలకు ద్వారా ఎక్కువ కేసులు రాజీ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి అర్జున్ అర్జున్, ఏడవ అదనపు మెట్రోపాలిటాన్ మెజిస్ట్రేట్ శ్రావణి యాదవ్,ఎనిమిదవ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ అలేఖ్య, తొమ్మిదో అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ తిరుపతి, మేడ్చల్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సిహెచ్ హనుమంత్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జి వినోద్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయ రెడ్డి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్ పవన్ రెడ్డి, కోర్టు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**జవహర్ నగర్, డిసెంబర్ 21,(ప్రజాస్వరం):**

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం పోలీస్ స్టేషన్ పరిధిలోని వికలాంగుల కాలనీ సమీపంలో వ్యక్తి ఊరు వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు .పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్, వెంకటేశ్వర కాలనీలో నివసించే జార్ఖండ్ కు చెందిన సంజీవ్ కుమార్ (40)కు విజయ లక్ష్మి కి పెద్దల సమక్షంలో వివాహం జరిగింది వీరికి ఏడు సంవత్సరాల ఒక కొడుకు ఉన్నాడు. సంజయ్ కుమార్ జార్ఖండ్ రాష్ట్రానికి చెందినవాడైనప్పటికీ హైదరాబాద్లో పుట్టి పెరిగాడు. గతంలో టెంట్ హౌస్లో పని చేసి, ప్రస్తుతం పెయింటర్గా పని చేస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈనెల 17వ తేదీన ఇంటి అద్దె విషయమై ఆమె భార్య తన భర్తను అడగగా, అతడు ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అనంతరం వారు భోజనం చేసి నిద్రపోయారు. తదుపరి తేదీ 18 ఉదయం 05:00 గంటలకు పాలు తెచ్చేందుకు వెళ్తున్నానని చెప్పి తన మొబైల్ ఫోన్ ఇంట్లోనే వదిలి వెళ్లి మరల తిరిగి రాలేదు. గతంలో కూడా అతడు ఇలాగే వెళ్లి 2-3 రోజుల తర్వాత తిరిగి వచ్చేవాడు కావున, ఈసారి కూడా అలాగే వస్తాడు అనుకున్నామని ఆర్థిక ఇబ్బందులు,మానసిక ఒత్తిడి కారణంగా తన భర్త ఆత్మహత్య పాల్పడినట్టు భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.



## 22 ఏళ్ల తర్వాత గురువుల సాన్నిధ్యంలో

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**దౌల్తాబాద్ డిసెంబర్ 21 ప్రజాస్వరం**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాంసాగర్ 2002-2003 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం రాయపోల్ మండలం రాంసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆత్మీయ వాతావరణంలో ఘన సమ్మేళనం నిర్వహించారు. విద్యాభ్యాసం పూర్తిచేసి సుమారు 22 సంవత్సరాల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకోవడం పూర్వ విద్యార్థుల్లో అపార ఆనందాన్ని, భావోద్వేగాలను రేకెత్తించింది. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, చిన్ననాటి స్నేహాలు, గురువుల బోధనలు, పాఠశాల రోజులు గుర్తొచ్చి మనసు ఉప్పొంగిందన్నారు. ఈ రోజు తాము ఉద్యోగాలు, వ్యాపారాలు, వివిధ రంగాల్లో స్థిరపడటానికి ప్రధాన కారణం తమ గురువులేనని స్పష్టంగా పేర్కొన్నారు. తల్లి, తండ్రుల తరువాత జీవితానికి సరైన దిశానిర్దేశం చేసినవారు గురువులేనని అన్నారు.త్రిమూర్తులు అంటే తల్లి, తండ్రి, గురువు అని పేర్కొంటూ, గురుదక్షిణ కింద గురువులకు ఏమిచ్చినా వారి ఋణం తీర్చలేమని, ప్రతి వ్యక్తి జీవితంలో కత్తిపోటు తప్పినప్పటికీ కలంపోటు తప్పదని తెలిపారు. ఒక చిన్న అటెండర్ స్థాయి నుంచి ఐఏఎస్ వంటి ఉన్నత పదవులు, దేశ అత్యున్నత పదవులైన ప్రధాని, రాష్ట్రపతి వరకు ఎవరైనా పాఠశాల విద్య, గురువుల బోధన లేకుండా సాధించలేరని స్పష్టం చేశారు.మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, చాలా సంవత్సరాల తర్వాత విద్యార్థులందరినీ ఒకే వేదికపై చూడడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఉపాధ్యాయులకు విద్యార్థులు తమకంటే ఉన్నత స్థాయికి ఎదగడం కంటే గొప్ప గురుదక్షిణ మరొకటి లేదని తెలిపారు. విద్యార్థులందరూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.అనంతరం, పూర్వ విద్యార్థులు తమ గురువులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పొగమంచు తో వాహనదారులు జాగ్రత్త

- **వాహనాలను నెమ్మదిగా నడిపి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరాలి..**
- **జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు...**

**మెదక్ డిసెంబర్ 21 (ప్రజా స్వరం)**




జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు వాతావరణంలో దట్టమైన పొగమంచు ఏర్పడుతున్న నేపథ్యంలో వాహనదారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు ప్రజలకు ఒక ప్రకటనలో తెలిపారు. పొగమంచు తీవ్రత పెరగడం వల్ల రాత్రి, తెల్లవారుజామున రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు, పాదచారులు స్పష్టంగా కనిపించక రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో చిన్న పాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీయవచ్చని హెచ్చరించారు. అందువల్ల అత్యవసరమైతే తప్ప ఈ సమయాల్లో ప్రయాణాలు చేయకుండా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అత్యవసరంగా ప్రయాణించాల్సి వచ్చినప్పుడు వాహనాలను నెమ్మదిగా, జాగ్రత్తగా నడపాలని సూచించారు. తక్కువ వీక్షణ సామర్థ్యం కారణంగా మలుపులు, ఇతర వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలు జరగవచ్చని పేర్కొన్నారు. ఈ సమయంలో హెడ్ లైట్లను లో బీమ్ లో ఉంచి, ఫాగ్ లైట్లను వినియోగించాలని సూచించారు. ప్రయాణానికి ముందు వాహనాల స్థితిని తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, ముఖ్యంగా బ్రేకులు, లైట్లు, టైర్లు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేసుకోవాలని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ఆకస్మిక ఓవర్ టేక్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని ఎస్పీ తెలిపారు. పోలీసుల సూచనలు, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రతి వాహనదారుడు తమ గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవాలని వెల్లడించారు.

## వాగునుతి గ్రామ సర్పంచ్ శ్రీశైలంకి ఘన సన్మానం

**గజ్వేల్/ములుగు డిసెంబర్ 21 ప్రజాస్వరం**

గ్రామాలే దేశానికి పట్టుకొమ్మాలని, అలాంటి గ్రామాభివృద్ధిలో సర్పంచ్ లు పాత్ర కీలకం అని క్షిరసాగర్ గ్రామస్థులు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా ములుగు మండలం వాగునుతి గ్రామ సర్పంచ్ గా శ్రీశైలం గెలువడంతో వారిని సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదర్శ గ్రామంగా వాగునుతి ని గ్రామ ప్రజల ఐక్యతతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టి పారదర్శక పరిపాలనతో గ్రామాభివృద్ధికి సేవ చేయాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక వసతులు, రహదారులు,తాగు నీరు, విద్యా, ఆరోగ్య రంగాల్లో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించేందుకు సర్పంచ్లు కీలక పాత్ర పోషించాలన్నారు. అందరికీ విద్యా వంటి అన్ని రంగాలలో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొన్యాల నర్సింహా రెడ్డి, కొన్యాల సంతోష్, నల్ల వినోద్, సత్యనారాయణ,కోళ్ల నాగరాజ్, రాజు, బాలయ్య, మధు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు





# కోడి గుడ్ల ధరలకు రెక్కలు

- **హోల్‌సేల్‌లో ఒక్కోటి రూ.7.30.. బహిరంగ మార్కెట్‌లో రూ.8**
- **పౌల్ట్రీ చరిత్రలోనే ఇదే అత్యధికమంటున్న వ్యాపారులు**
- **ఉత్పత్తి తగ్గడం వల్లే పెరుగుతున్న రేట్లు**

**హైదరాబాద్ డిసెంబర్ 21(ప్రజాస్వరం):**

కోడి గుడ్డు ధరలకు రెక్కలొచ్చాయి. కొద్ది నెలల క్రితం బహిరంగ మార్కెట్‌లో రూ.5 నుంచి రూ.6 వరకు పలికిన కోడి గుడ్డు ధర ప్రస్తుతం రూ.8కు చేరింది. హోల్‌సేల్ మార్కెట్‌లోనే ఒక్కో కోడి గుడ్డు రూ.7.30పై పలుకుతుండడం గమనార్హం. పౌల్ట్రీ రంగ చరిత్రలోనే ఇదే రికార్డు ధరని పౌల్ట్రీ రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. మరోపక్క, సామాన్యులు మాత్రం గుడ్డు ధరలు విని అమ్మో అంటున్నారు. గతంలో 30 కోడిగుడ్లు రూ.160170 వరకు విక్రయించేవారు. 10 రోజులుగా 30 కోడి గుడ్లను రూ. 210220 వరకు హోల్‌సెల్ మార్కెట్‌లోనే విక్రయిస్తున్నారు. నాటు కోడి గుడ్లు అయితే ఒక్కో గుడ్డును రూ.15 వరకు విక్రయిస్తున్నారు. డిమాండ్‌కు తగిన ఉత్పత్తి లేకపోవడం వల్లే కోడి గుడ్ల ధరలు పెరిగిపోతున్నాయని పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులు చెబుతున్నారు. గతంలో తెలుగు రాష్ట్రాల్లో కలిపి రోజుకు సుమారు 8 కోట్ల గుడ్లు ఉత్పత్తి అయ్యేవి. అయితే, కోడి గుడ్ల ఉత్పత్తికి అవసరమయ్యే దాణ, మక్కలు, చేపపొట్టు వంటి వాటి ధరలు పెరిగిపోవడంతో చాలా మంది పౌల్ట్రీ రైతులు కోళ్ల ఫారాల నిర్వహణ ఆపేశారు. దీంతో గుడ్ల ఉత్పత్తి తగ్గిపోయింది. ఒకప్పుడు ప్రతి రోజు కనీసం 20 కోట్ల గుడ్లు కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉండేవని ఇప్పుడా పరిస్థితి లేదని పౌల్ట్రీ పరిశ్రమ ప్రతినిధులు చెబుతున్నారు.

**ఇదే ఆల్‌టైమ్ గరిష్ఠ ధర**

ప్రస్తుతం ఒక్కో కోడి గుడ్డు ధర హోల్‌సేల్‌లోనే రూ.7.30, రిటైల్‌లో రూ.8పలుకుతోంది. పౌల్ట్రీ చరిత్రలోనే కోడిగుడ్డుకు ఇంత ధర ఎప్పుడూ లేదు. మరో రెండు నెలలు ఇదే ధర ఉంటుందని భావిస్తున్నాం.



# మోదీ పంపిన 'చీటీ' ప్రకారమే కేసీఆర్ కదలికలు

**హైదరాబాద్, డిసెంబర్ 21(ప్రజాస్వరం)**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి హీట్ పెరిగింది. ప్రభుత్వ విప్, కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పార్టీ కార్యాలయానికి రావడం కాదు, అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ బీజేపీ మధ్య 'చీకటి దోస్తానా' ఉందని ఆయన ఆరోపించారు. ప్రధాని మోదీ కేసీఆర్‌కు ఒక 'చీటీ' పంపారని, ఆ పని చేయడానికే కేసీఆర్ ఇప్పుడు బయటకు వచ్చారని సంచలన వ్యాఖ్యలు చేశారు. 'మునిగిపోతున్న పార్టీని కాపాడుకోవడం కోసమే కేసీఆర్ బయటకు వచ్చారు. ప్రజల కోసం కాదు. మోదీ.. కేసీఆర్ ఆరోగ్యంపై ఆరా తీయడం దేనికి సంకేతం? ఇంకా ఎంతకాలం ఈ చీకటి దోస్తానా చేస్తారు?" అని ప్రశ్నించారు. గతంలో నల్ల చట్టాలకు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని, ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరు తొలగిస్తే బీఆర్ఎస్ నాయకులు నోరు మెదపకపోవడాన్ని విమర్శించారు. కెసిఆర వ్స్తే అసెంబ్లీలో చర్చిద్దామని సవాల్ విసిరిన ఆది శ్రీనివాస్, ఎనిమిది లక్షల కోట్ల అప్పులు, కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిపోవడం వంటి అంశాలపై కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణాగోదావరి జలాలను రాయలసీమకు మళ్లిస్తానని మాజీ మంత్రి రోజా ఇంటికి వెళ్లి కేసీఆర్ చెప్పారని, దీనికి తెలంగాణ ప్రజలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలని ఆయన అన్నారు.

# కొలువుదీరనున్న గ్రామ పాలకులు!

**హైదరాబాద్ డిసెంబర్ 21(ప్రజాస్వరం):**

ఎన్నికల హడావుడితో గ్రామాలలోని నాయకులు నిద్రలేని రాత్రులు గడుపుతూ ఓటర్లను ఆకర్షించడానికి విశ్వప్రయత్నాలు చేశారు. అభ్యర్థులు ఒకరిని మించి మరొకరు పోటీపడుతూ ప్రచార పర్వాన్నీ ముగించుకొని మూడు విడతలుగా ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. 12,702 గ్రామ పంచాయతీలకు ప్రథమపౌరుడి నియామకాలు జరిగిపోయాయి. ఈ నెల 22న అధికారికంగా ప్రమాణ స్వీకారాలు చేసి గ్రామ పాలకులుగా కొలువుదీరనున్నారు. పోటీలో ఎంతమంది అభ్యర్థులున్నప్పటికీ చివరికి గెలుపొందేది మాత్రం ఒక్కరే. కొలువుతీరాక కక్షగట్టే ధోరణితో, స్వార్థపూరిత ఆలోచనలతో, ఖర్చుపెట్టిన డబ్బును ఎలా రాబట్టుకోవాలోనని, తమకు మద్దతివ్వనివారిపై ఏవిధంగా కక్షపూరిత చర్యలు చేపట్టాలనో గాకుండా ఆదర్శవంతమైన పాలన అందించాలి. అవినీతికి పాల్పడకుండా దాదాపు ఐదు సంవత్సరాలపాటు గ్రామాభివృద్ధికి గ్రామంలోని పలువురితో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలి. ప్రతి కార్యక్రమంలో గ్రామప్రజలను భాగస్వాములుగా చేస్తూ ఎలాంటి కుల, మత, వర్గ భేదాలు లేకుండా అందరినీ సమానంగా చూడాలి.

**పాలకుల ముందున్న ప్రజాసమస్యలు**

గత కొన్ని సంవత్సరాల నుంచి కొన్ని గ్రామాలలో నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ, ట్యాంకర్లతో నీటిని అందించడం జరిగింది. సర్పంచ్ లు సైతం ముందు జాగ్రత్తతో ప్రణాళికాయుతంగా వేసవికాలంలో మంచినీటి సమస్య లేకుండా చూసుకోవాలి. వితంతువులు, వృద్ధులు, అంగవైకల్యం కలిగినవారికి ప్రతి నెల పింఛను వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలి. ఏమైనా సాంకేతిక సమస్యలతో పేర్లు తొలగించితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాల్సిన అవసరం ఉన్నది. రేషన్ సరుకులు సక్రమంగా అందుతున్నాయా? ప్రతి నిరుపేదకు ఉపాధిహామీ పథకంలో చోటు ఉన్నదా? రైతు బీమా, రైతుబంధు వస్తుందా? గృహాల కల్పనలో నిరుపేదలకు స్థానమున్నదా? పాఠశాలలు సక్రమంగా నడుస్తున్నాయా? ప్రభుత్వం చేపట్టే పోలియో చుక్కల నిర్వహణ, వాక్సిన్‌కు తోడ్పాటు అందిస్తున్నారా? ప్రతి ఒక్కరి ఇంటికి మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు ఉన్నాయా? వీటన్నింటినీ చూసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉన్నది. రైతులకు ప్రాధాన్యమిచ్చి ప్రతి రైతుకు పంట లోన్లు, పంట నష్టపరిహారం అందేలా చూసుకోవాలి. వంద శాతం అక్షరాస్యత, పచ్చదనం, పరిశుభ్రతకు సహకరించాలి. దేశానికి ప్రధాని ఎంతో గ్రామానికి సర్పంచ్‌కూడా అంతే. కాబట్టి గ్రామాభివృద్ధి సర్పంచ్ నిజాయితీ, చిత్త శుద్ధిపై ఆధారపడి ఉంటుందని మర్చిపోకూడదు!




**పథకాలపై అవగాహన పెంచుకోవాలి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే ప్రతి పథకంపట్ల అవగాహన పెంచుకోవాలి. ఆ పథకాలను తమగ్రామంలోని పేదలకు, ఎవరు ఏ పథకానికి అర్హులో వారికి ఆ ఫలాలను అందించేందుకు కృషి చేయాలి. గ్రామ పాలకులు గ్రామాభివృద్ధి దిశగా పయనించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. కానీ, చాలా గ్రామాలలో గెలుపొందిన అభ్యర్థులు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఫలాలు వచ్చినా ముందుగా వారి పార్టీ కార్యకర్తలకు ఎలాంటి షరతులు పెట్టకుండా అధిక ప్రాధాన్యతనిస్తూ ఇప్పించడం జరుగుతున్నది. మరీ ముఖ్యంగా గ్రామాలలో ఉచిత పథకాల విషయంలో తమవర్గానికి మద్దతు ప్రకటిస్తూ వర్గపూరిత రాజకీయాలకు తెరలేపుతుంటారు. ఇది మంచి పరిణామం కాదు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే యావత్తు దేశం అభివృద్ధి చెందుతుంది. గ్రామంలోని ప్రతి ఒక్కరు వృద్ధిలోకి వస్తేనే గ్రామంసైతం అభివృద్ధి చెందుతుంది. గ్రామాభివృద్ధి అనేది గ్రామ ప్రథమ పౌరుడిపై ఆధారపడి ఉంటుంది. కావున, గ్రామ ప్రజలందరితో నిస్వార్థంతో, నిజాయితీతో వ్యవహరించాలి. ఎలాంటి పక్షపాత ధోరణి అవలంబించకుండా అర్హులందరికీ ఆసరాగా ఉంటూ అభివృద్ధికి పాటు పడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

# మెగా లోక్ అదాలత్‌తో సైబర్ బాధితులకు న్యాయ వెలుగు

- **17 కేసుల్లో రూ.12.50 లక్షలు రికవరీ**
- **డిజిటల్ దోపిడీకి చట్టపరమైన అడ్డుకట్ట**
- **జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**



**వనపర్తి, డిసెంబర్ 21 (ప్రజాస్వరం):**

జాతీయ మేగా లోక్ అదాలత్ సందర్భంగా వనపర్తి జిల్లాలో సైబర్ నేరాల బాధితులకు న్యాయం లభించింది. జిల్లాలో నమోదైన 17 సైబర్ నేర కేసుల్లో బాధితులు కోల్పోయిన మొత్తం రూ.12 లక్షల 50 వేల సొమ్మును సైబర్ క్రైమ్ పోలీసులు సమర్థంగా ట్రేస్ చేసి, లోక్ అదాలత్ ద్వారా చట్టబద్ధంగా బాధితులకు తిరిగి అందజేశారని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వనపర్తి న్యాయస్థానంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఈ మొత్తాన్ని బాధితులకు అప్పగించారు. సుదీర్ఘ దర్యాప్తు, బ్యాంకింగ్ వ్యవస్థలతో సమన్వయం, న్యాయ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయడం వల్లే ఈ రికవరీ సాధ్యమైందని ఎస్పీ తెలిపారు. బాధితుల ముఖాల్లో ఆనందం పోయిన డబ్బు తిరిగి అందుకోవడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. సైబర్ నేరాలపై కఠినంగా వ్యవహరిస్తూ తమకు న్యాయం అందించిన వనపర్తి జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులను వారు హృదయపూర్వకంగా ప్రశంసించారు.


సైబర్ నేరాలకు సున్నా సహనం ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సైబర్ నేరాలపై వనపర్తి జిల్లా పోలీసు శాఖ సున్నా సహనం విధానంతో పనిచేస్తోందన్నారు. మోసపోయిన ఒక్క బాధితుడికైనా న్యాయం అందించాలనే లక్ష్యంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, చట్టపరమైన మార్గాలను సమర్థంగా వినియోగిస్తున్నామని చెప్పారు. వెంటనే ఫిర్యాదు చేయాలి సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా గోల్డెన్ అవర్‌లో 1930 హెల్ప్‌లైన్‌కు లేదా cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేస్తే, డబ్బు తిరిగి పొందే అవకాశం మరింత పెరుగుతుందని ఎస్పీ సూచించారు. ప్రజల నమ్మకమే పోలీసు శాఖకు ప్రధాన శక్తి అని ఆమె పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ బృందానికి అభినందనలు సైబర్ నేరాల విచారణలో సమర్థవంతంగా పనిచేసి బాధితులకు న్యాయం అందించడంలో కీలక పాత్ర పోషించిన వనపర్తి జిల్లా సైబర్ క్రైమ్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



# ప్రవళిక కుటుంబాల సభ్యులను పరామర్శించిన మందకృష్ణ మాదిగ

**ముసాపేట డిసెంబర్ 21(ప్రజాస్వరం):**

మహబూబ్నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల గ్రామంలో అత్యాచారానికి గురై మరణించినటువంటి దళిత మాల కులానికి చెందినటువంటి ప్రవళిక కుటుంబాల సభ్యులను పరామర్శించిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ వేముల గ్రామానికి విచ్చేసిన అనంతరం మృతురాలు ప్రవళిక చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి సంఘటనకు సంబంధించినటువంటి విషయాలు అన్నీ కూడా ఆరా తీశారు. అత్యాచారం కేసులో ఇంకా ఎంతమంది ఉన్నారు. అనే దానిమీద పోలీసులు సమగ్రమైనటువంటి నిష్పక్షపాతమైన విచారణ సిట్ తో జరిపించాలని అత్యాచారం జరిగినటువంటి ప్రదేశం రైతు వేదిక, అంగన్వాడి సెంటర్ను కూడా పరిశీలించి అలాగే ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సభ్యులు శంకర్లతో ఫోన్లో మాట్లాడి ఈ గ్రామాన్ని త్వరలో సందర్శించాలని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. బాధ్యత కుటుంబానికి ప్రభుత్వం పరంగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందే వరకు ఎమ్మార్పీఎస్ నాయకత్వం కుటుంబానికి తోడుగా ఉండాలని మంద కృష్ణ మాదిగ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎరుకలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుతాడీ కుమార్ ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బుర్ర బిక్షపతి మాదిగ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ మాదిగ ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తిక్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# పట్టణ కాంగ్రెస్ పార్టీ ముఖ్య సమావేశం

**సంగారెడ్డి జిల్లా డిసెంబర్ 21(ప్రజాస్వరం)**

సదాశిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో ముఖ్య సమావేశం నిర్వహించడం జరిగింది టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, టి పి సి సి ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సదాశివపేట పట్టణంలో 26 వార్డులలో పలు అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఇంతకుముందు పట్టణ అభివృద్ధి పలు వార్డుల్లో సిసి రోడ్స్ సీసీ డ్రైన్స్ పనులు మరియు పలు అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించినా 18 కోట్ల నలభై లక్షల రూపాయల పనులకు టెండర్ వెయడం జరిగింది. త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుంది. ఇవేకాక మరికొన్ని అభివృద్ధి పనులకు 26 వార్డులలో వార్డు ఇన్చార్జిలు ఇందిరమ్మ కమిటీ మెంబర్స్ ద్వారా సిసి డ్రైన సిసి రోడ్ విద్యుత్ స్తంభాలు మరియు మైనార్టీ షాదీఖానా గురించి




కూడా తెలపడం జరిగింది అభివృద్ధి పనులకు నిధులు గురించి బోర్ల గురించి అదేవిధంగా మంచినీటి సమస్య గురించి నివేదిక పంపడం జరిగింది కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న పథకాలు ప్రతి ఇంటికి చేరేలా అదేవిధంగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలకు సూచించడం జరిగింది. నెంబర్ వన్ ఉచిత కరెంటు నెంబర్ టు రేషన్ కార్డు నెంబర్ 3 సన్న బియ్యం నెంబర్ 4 బస్సు నెంబర్ 5 రుణమాఫీ నెంబర్ 6 500 గ్యాస్ సబ్సిడీ ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మునిపల్లి సత్యనారాయణ మాజీ బీసీ కార్పొరేషన్ నెంబర్ పట్నం సుభాష్ మాజీ వైస్ చైర్మన్ పిల్లోడి విశ్వనాథం, మాజీ కౌన్సిలర్లు పట్లూరి నాగరాజుగౌడ్, లక్ష్మీప్రసన్న శంకర్ గౌడ్, గుండు రవికుమార్, రాయిపాట్ రమేష్, సత్యనారాయణ, డైరెక్టర్లు రాములు గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి వాజిద్, కళావతి, ఎండి సాబీర్, గంగారం స్వరూప, ఇందిరమ్మ కమిటీ నెంబర్స్ వార్డ్ ఇంచార్జ్ మఠం వీరన్న, కౌలే విజయ్ కుమార్, ఎండి లతీఫ్, రాఘవేందర్, నాగేష్, తుకారాం, కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# నాగ్సాన్ పల్లి గ్రామంలో ఎల్లమ్మ తల్లి పూజలు

**సంగారెడ్డి జిల్లా డిసెంబర్ 21(ప్రజాస్వరం):**

సదాశివపేట మండలంలోని నాగ్సానపల్లి గ్రామంలో నూతనంగా ఎన్నిక కాబడిన సర్పంచ్ కాశీపురం రవికుమార్ గ్రామంలోని ఎల్లమ్మ తల్లి మందిరం వద్ద పూజలు నిర్వహించగా ఈ కార్యక్రమంలో సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆ గ్రామ దేవతలు చల్లగా గ్రామాన్ని కాపాడాలని గ్రామ ప్రజలను కాపాడాలని మొక్కుకున్నారు. గ్రామంలోకి శాసనసభ్యులు ప్రవేశించగా గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున భాజా భజంత్రీలతో డప్పు జప్పులతో స్వాగతం పలికి ఘనంగా శాలువాలతో సన్మానించారు. అలాగే సర్పంచ్ కు ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు గ్రామ ప్రజలకు అందరికీ శాలువాలతో సత్కరించే అభినందనలు తెలిపారు. గ్రామ ప్రజలు మీకు ఇచ్చిన ఈ సదవకాశాన్ని ప్రజలందరికీ మేలు జరిగేలా మీరు కృషి చేయాలని అలాగే ఎటువంటి సమస్య వచ్చినా నాకు తెలిపినచో అతి సమస్యను వీలైనంత త్వరగా నేను పరిష్కరిస్తానని గ్రామ ప్రజలకు పాలకవర్గం సాక్షిగా హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచ్ రవికుమార్ ఉపసర్పంచ్ ప్రశాంత్ ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెద్దగోల్ల ఆంజనేయులు మాజీ గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ మాజీ ఉప సర్పంచ్ ఆంజనేయులు గ్రామ శాఖ అధ్యక్షులు కుమ్మరి రమేష్ వార్డు సభ్యులు రవి లతా సుధా సుమిత్ర నర్సింలు మంగమ్మ నరసింహ గౌడ్ నాయకులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాస్వరం PRAJASWARAM తెలుగు దినపత్రిక
22.12.2025
సోమవారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com


## ఉజ్వల టాలెంట్ టెస్ట్ 2025 కు అనూహ్య స్పందన తో భారీగా హాజరైన విద్యార్థులు

**సంగారెడ్డి జిల్లా డిసెంబర్ 21(ప్రజాస్వరం):**

సదాశివపేట పట్టణంలోని ఉజ్వల జూనియర్ కళాశాలలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ కు 1048 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ టాలెంట్ టెస్ట్ కు సదాశివపేట్, మోమినిపేట్, మునిపల్లి, కొండాపూర్ మరియు మర్పల్లి మండలలోని సుమారుగా 52 స్కూళ్లకు చెందిన విద్యార్థులు హాజరై ఈ పరీక్షను వ్రాయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కూచి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహణలో సహకరించిన కళాశాల సిబ్బందికి, ప్రైవేట్ స్కూల్ మేనేజ్మెంట్, గవర్నమెంట్ స్కూల్ హెడ్మాస్టర్లకు మరియు వారి సిబ్బందికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పోలా వెంకటేశం డైరెక్టర్లు ముద్ద నాగనాథ్, రఘు, వర్ధన్ రెడ్డి, అమరేందర్ రెడ్డి కళాశాల ఉపాధ్యాయులు సునీత, స్వాతి, నరేష్, జీవిత, గంగయ్య, వరలక్ష్మి, లావణ్య, ప్రియాంక, సంగమేశ్వర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, నర్సింలు, నవాబ్, సమీర్, రాజు మరియు మమత పాల్గొన్నారు.



## మండలవ్యాప్తంగా నేడు గ్రామపంచాయతీల్లో సర్పంచులు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం

**షాబాద్ డిసెంబర్ 21(ప్రజాస్వరం):**


మండల పరిధిలోని వివిధ గ్రామపంచాయతీలలో ఇటీవల ప్రజల ఓటుతో ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచులు మరియు వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాలు నేడు ఆయా గ్రామపంచాయతీల్లో ఘనంగా నిర్వహించబడనున్నాయి. ఈ కార్యక్రమాలు సంబంధిత గ్రామ పంచాయతీలకు కేటాయించబడిన ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో, ప్రభుత్వ నిబంధనలు, చట్టపరమైన మార్గదర్శకాల ప్రకారం జరగనున్నట్లు మండల అధికారులు వెల్లడించారు. కార్యక్రమాల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించనున్న ప్రజా ప్రతినిధులు గ్రామాల సమగ్ర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిబద్ధతతో పని చేయాలని అధికారులు సూచించారు. ప్రజాస్వామ్య విలువలను పటిష్ఠం చేసే దిశగా ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాలు కీలకమైనవని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పత్రికా ప్రతినిధులు, ప్రజలు కార్యక్రమాలకు సహకరించాలని అధికారులు కోరారు.




## గోల్డ్ మెడల్ సాధించిన భువనగిరి సాయినాథ్

**వలిగొండ డిసెంబర్ 21(ప్రజాస్వరం):**

జాతీయస్థాయి కరాటే పోటీలలో వలిగొండ పట్టణ కేంద్రానికి చెందిన భువనగిరి సాయినాథ్ ఆదివారం హైదరాబాదులోని చందా నగర్ స్టాండర్డ్ షిటీరియో కరాటే ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీలలో గోల్డ్ మెడల్ సాధించినట్లు సీనియర్ కరాటే మాస్టర్ భువనగిరి ముత్యాలు ఆదివారం విలేకరులకు తెలిపారు. సాయినాథ్ నీ ఇండియా గ్రాండ్ మాస్టర్ పీ బాలరాజు అభినందించారు.





# బీజేపీది గాడ్సే వారసత్వం

- గాంధీ పేరు అంటే అంత అయిష్టమా
- దేశం నుండి బిజేపిని బహిష్కరించాలి
- డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

**ఖమ్మం డిసెంబర్ 21(ప్రజాస్వరం):**

బీజేపీది గాంధీని చంపిన గాడ్సే వారసత్వమని నేడు బిజెపి ప్రభుత్వం విధానాలతో తేటతెల్లం అవుతుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ స్పష్టం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిరసనగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పిలుపుమేరకు టిపిసిసి ఆదేశానుసారం ఖమ్మం నగరంలో గాంధీ చౌక్ నందు గాంధీ విగ్రహం దగ్గర నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి మరియు శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి,శజిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ లు మాట్లాడుతూ ఈ దేశంలో బీజేపీ రాష్ట్ర ప్రభుత్వం 11 ఏళ్ల పరిపాలల్లో ఎన్నో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ పేదరికాన్ని నిర్మూలించాల్సిన ప్రభుత్వమే, పేదరికాన్ని పెంచి పోషిస్తుంది. ఆనాడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ దేశంలో ప్రతి ఒక్కరికి మరియు ప్రతి పేద వాడికి ఉపాధి కల్పించి తద్వారా వారి జీవన శైలిని మార్చే విధంగా ఆకలి మరణాలు ఉండకూడదని ఓ బృహత్కర కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలకు ఉపాధిని కల్పించే ఒక చట్టాన్ని తీసుకొచ్చి ఆ పథకం పేరు మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం గా రూపొందించి ప్రజలకు అందిస్తే ఈనాడు ఆ చట్టాన్ని రద్దు చేసి రాక్షస ఆనందాన్ని పొందుతున్న ఈ బీజేపీ ప్రభుత్వం పనితీరును ఖచ్చితంగా ఎండగడతాం ప్రజల పక్షాన ప్రజా సంక్షేమ కాంగ్రెస్ పార్టీ నిరంతరం పనిచేస్తుందని ఇలాంటి ద్వంద వైఖరిని మానుకోకపోతే తగిన గుణపాఠం చెప్తావని ఈ సందర్భంగా గాంధీ విగ్రహం దగ్గర బిజెపి కేంద్ర ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. అనంతరం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల. నాగేశ్వరరావు, శాసనమండలి మాజి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు వద్దేబోయిన నరసింహారావు,ఖమ్మం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు లు మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరు మార్పు పై మోదీపై మండిపడ్డారు, ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిపాటి వెంకయ్య,జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వేజండ్ల సాయి కుమార్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, మొక్క శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, కార్పొరేటర్లు దుద్దుకూరి వేంకటేశ్వరరావు, మలీదు వేంకటేశ్వరరావు, లకావత్ సైదులు నాయక్, గజ్జల లక్ష్మి వెంకన్న,పల్లెబోయిన భారతి చంద్రం,ఖమ్మం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తల్లాడ రమేష్,జిల్లా ఓ బి సి సెల్ ఉపాధ్యక్షులు బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, గజ్జి సూర్యనారాయణ, నగర ఓ బి సి సెల్ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, షేక్ రజి భాయ్, నున్నా మాధవరావు, బెడద సత్యనారాయణ, కిలారి అనిల్ కుమార్, నాళం సతీష్,షేక్ రషీద్, ఏలూరి రవికుమార్, వసీం, మహమూద్, బెజ్జం గంగాధర్, విప్లవ కుమార్, రాకేష్ , ఫజల్, వెంకట్రావు, ఫరీద్ ఖాద్రి, సందీప్, షఫీ,కే నారాయణ, బొమ్మ ఉదయ్, పండు, భూక్యా సురేష్ నాయక్, జాని, ఊరుకొండ చంద్రిక, మంగ, అన్నపూర్ణ, సుకన్య తదితర నాయకులు పాల్గొన్నారు.







## ఘనంగా మండలంలో ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి 53 వ పుట్టినరోజు వేడుకలు.

**బంగారుపాళ్యం డిసెంబర్ 21(ప్రజాస్వరం):**

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండల పరిధిలోని రాజా వీధి నందు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను పూతలపట్టు మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని వైఎస్ఆర్సిపి శ్రేణులు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని, బారీ కేక్ కట్ చేసి ఆనందోత్సవాల నడుమ ఆదివారం ఉదయం 10 గంటలకు ఘనంగా నిర్వహించారు. మండలంలో పలుచోట్ల అభిమానులు ఉదయం నుండి సాయంత్రం వరకు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొన్నిచోట్ల అన్నదాన కార్యక్రమాలు వైఎస్ఆర్సిపి నాయకులు నిర్వహించారు. మండల ప్రభుత్వ ఆసుపత్రి నందు డాక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో రోగులకు బ్రెడ్లు, పండ్లు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శిరీష పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన పలువురు నాయకులలో మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్, మాజీ శాసన సభ్యురాలు లలితా థామస్, జడ్పీ మాజీ చైర్మన్ ఎం బి కుమార్ రాజా, జడ్పిటిసి సోమశేఖర్, మండల కన్వీనర్ పాలేరు రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, మండల కో ఆప్షన్ నెంబర్ అన్ను, సింగిల్ విండ్ మాజీ చైర్మన్ దత్తాత్రేయ రెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా సంయుక్త కార్యదర్శి కిషోర్ కుమార్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ప్రభ నాయుడు, జిల్లా నాయకులు శరత్ రెడ్డి, ప్రకాశ్ రెడ్డి, కృపా సాగర్ రెడ్డి, సర్దార్, వైయస్సార్సీపి మండల బిసిసెల్, ముస్లిం మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, తదితర వైఎస్ఆర్సిపి మండల నాయకులు, సర్పంచ్లు ఎంపీటీసీలు నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మణుగూరు మున్సిపాలిటీ అధికారులతో సమీక్ష సమావేశం



- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**బూర్గంపహాడ్ డిసెంబర్ 21(ప్రజాస్వరం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలపై పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మున్సిపాలిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరా, అంతర్గత రహదారుల అభివృద్ధి, వీధిదీపాల నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ తదితర అంశాలపై ఎమ్మెల్యే విస్తృతంగా చర్చించారు. ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను వెంటనే గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి పని నాణ్యతతో పాటు నిర్ణీత గడువుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణం, సైడ్ డ్రెయిన్ కాలువల పనుల పురోగతిపై మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో నీరు నిలవకుండా సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ప్రజలకు నిరంతర నీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పూర్తి పారదర్శకతతో పథకం అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావుతో పాటు అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు మాట్లాడుతూ, ఎమ్మెల్యే సూచనల మేరకు అన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు మున్సిపాలిటీ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు.

## లోక్ అదాలత్ ద్వారా 481 కేసులు పరిష్కారం

**వలిగొండ డిసెంబర్ 21(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట కోర్టు పరిధిలో మొత్తం 481 కేసులకు పరిష్కారం లభించింది. ఆదివారం నాడు రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జ్ జి.సబిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష, సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి డి. సత్తయ్య లు కలిసి కోర్టు హాల్ లో జాతీయ లోక్ అధాలత్ ను నిర్వహించారు. రామన్నపేట జ్యుడిషియల్ సంబంధించి రామన్నపేట, వలిగొండ, మోత్కూరు, అడ్డగుడూరు స్టేషన్ పరిధిలో క్రిమినల్ కేసులు 112, ప్రీ లిటికేషన్ కేసులు 02, బ్యాంక్ కేసులు 09, ఇతర పిట్టి కేసులు 358 పరిష్కరించుకున్నారు. బ్యాంక్ కేసులు ద్వారా 5,95,169/ రూపాయలు అమౌంట్ రికవరీ చేయబడినట్లు తెలిపారు. అనంతరం జడ్జీ మాట్లాడుతూ క్షణిక ఆవేశాలతో అప్పటి పరిస్థితులలో కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బులు, సమయం వృధా చేసుకోవడం బదులు రాజమార్గమే యాజమార్గంగా కోర్టు పరిధిలో నిర్వహించే లోక్ అధాలత్ వినియోగించుకొని సమస్యలు పరిష్కరించుకోవడానికి కక్షిదారులు ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ లు, పలు మండలాల ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్లు, వివిధ పోలీస్ స్టేషన్ ల సిబ్బంది, కోర్టు సిబ్బంది, లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.



## రైతుబజార్లో జాతీయ వినియోగదారుల వారోత్సవం.

**విశాఖపట్నం, డిసెంబర్ 21(ప్రజాస్వరం):**

నగరంలోని ఎంవిపి కాలని రైతు బజార్లో జాతీయ వినియోగ దారుల వారోత్సవాలు సందర్భముగా ఆదివారం వినియోగదారులకు తూనికలు, కొలతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ స్మార్ట్ సిటీ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధికారులు, లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ ఎమ్. దామోదర్ నాయుడు తదితరుల ఆధ్వర్యంలో వినియోగ దారులకు అవగాహన కల్పించారు. వినియోగదారులు కొనుగోలు చేసిన వస్తువులను ధర్మకాటా పై సరిచూసి తూకంలో ఎలాంటి తేడా కనిపించిన ఫిర్యాదు చేయాలని సూచించారు. తూనికలు, కొలతలపై వినియోగదారులకి ఎటువంటి సందేహం ఉన్న వెంటనే అధికారులకు పిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తూనికలు కొలతలు అధికారులు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కాంట్రోలర్ పీ.డి. వి.అప్పల రాజు, కె. రాజేష్ లు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రతి వినియోగ దారుడు వస్తువు కొనేముందు ఆ వస్తువు మీద నిర్ణీతమైన పరిమాణములు ఉన్నాయా లేదా, దాని మీద కంపెనీ తయారు చేసే ముద్ర ఉందా లేదా అని చూడాలన్నారు. వినియోగదారుల సంఘ సంయుక్త కార్యదర్శి స్మార్ట్ సిటీ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ వ్యవస్థాపక కార్యదర్శి పేర్ల, భాస్కరరావు, రైతుబజార్ ఎస్టేట్ అధికారి కె. వరహాలు, సహాయకుడు జి. కనక రాజు, రైస్ కౌంటర్ మురళి, వాచ్ మన్ దేముడు తదితరులు పాల్గొన్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999